



దేదీప్య దీపావళి

- జిల్లాలో అంబరాన్నంటిన సంబురాలు
- లోగిళ్లలో బాణసంచా సందడి
- వ్యాపార సముదాయాల్లో లక్ష్మీ పూజలు
- కనువిందు చేసిన బొమ్మల కొలువులు



సిద్దిపేట పట్టణంలోని శ్రీనగర్ కాలనీలోని ఓ ఇంట్లో బొమ్మల కొలువు

సిద్దిపేటకల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి అమావాస్య రోజున నల్లటి ఆకాశంలోకి తారాజువ్వల వెలుగు రవ్వలు దూసుకెళ్లాయి. పల్లె వీధుల్లో, పట్నం గల్లీల్లో పటాకుల శబ్దాలు మోతెక్కాయి. జిల్లావ్యాప్తంగా దీపావళి సంబురాలు అంబరాన్నంటాయి. పండుగ సందర్భంగా గురువారం ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి. మహిళలు దీపాలను వెలిగించి దీపావళికి స్వాగతం పలికారు. ఇళ్లల్లో దేవుని గదిలో, తులసి కోట వద్ద ప్రత్యేకంగా అలంకరించి దీపారాధన చేశారు. ఇళ్ల ముందు ప్రమిదలను వెలిగించి, ఇళ్లలోపల బొమ్మల కొలువు చేశారు. ప్రత్యేకమైన పాయసాలు, పిండివంటలు చేసుకున్నారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలను వివిధ రకాల పూలతో అలంకరించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీదేవి పూజలు చేసి మంచి లాభాలు అర్జించాలని భక్తితో కోరుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం టపాసుల రెట్లు పెద్దమొత్తంలో పెరిగినా కూడా ఎవరు కూడా తగ్గేదెలేదన్నట్లుగా కొనుగోలు చేశారు.

వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లో గురువారం జరిగిన దీపావళి వేడుకల్లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. సహకార సంఘ కార్యాలయం, మంత్రి క్యాంపు కార్యాలయాల్లో లక్ష్మీపూజ చేశారు. క్యాంపు కార్యాలయంలో టపాసులు కాల్చి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం పట్టణంలోని వీధుల్లో తిరుగుతూ మహిళలు, చిన్నపిల్లలతో ముచ్చటిస్తూ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సహకార సంఘం చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, అయిలయ్య, వల్లపు రాజు, నాయకులు రవీందర్ ఉన్నారు.



హుస్నాబాద్‌లో టపాసులు కాలుస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



సిద్దిపేటలో కాకరపూలు కాలుస్తున్న యువతులు, మహిళలు

పరమపవిత్రం కార్తీకం

శివకేశవులకు ప్రీతికరం.. నేటి నుంచి కార్తీకమాసం ప్రారంభం



సిద్దిపేటకల్చరల్/కొండపాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంస్కృతిలో కార్తీకమాసానికి ఎంతో విశిష్ఠత ఉంది. అందుకే ఈ నెలరోజులూ పర్వదినాలుగానే పరిగణిస్తారు. అంతటి విశిష్ఠత కలిగిన కార్తీకమాసం నేటి (శనివారం) నుంచి ప్రారంభంకానుంది. ఈనెల రోజుల పాటు శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగనున్నాయి.

కార్తీక మాసంలో ప్రాతఃకాలంలో చేసే స్నానం, వెలిగించే దీపం, చేసే పూజ, ఇచ్చే దానం.. వీటి వల్ల విశేష ఫలితాలు చేకూరుతాయని భక్తుల నమ్మకం. అలాగే కార్తీక మాసంలో నోములు, వ్రతాలకు విశిష్ట స్థానం ఉంది. ఉసిరిక లక్ష్మీదేవికి ఎంతో ఇష్టమైనది. కార్తీకమాసంలో ఈ ఉసిరిక చెట్టు కింది భోజనం చేయడం ఎంతో అదృష్టాన్నిస్తుందని భక్తులు నమ్ముతారు. బంధుమిత్రులతో కలిసి ఉసిరిక చెట్టు ఉన్న వనంలో భోజనాలు చేయడం వనభోజనాలుగా ప్రసిద్ధి. కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమి రోజున ఉసిరితో స్నానమాచరిస్తారు. ఈ రోజు శివ సన్నిధిలో వెయ్యి వొత్తులతో దీపం వెలిగిస్తే మహిళలకు సౌభాగ్యం కలుగుతుందని విశ్వసిస్తుంటారు. అయితే, ఈ మాసంలో కార్తీక స్నానం, కార్తీక దీపాలు, దేవతారాధన, కార్తీక యాత్ర భోజనం, కార్తీకమాస వ్రతాలు అలాగే దానాలు చేసినట్లయితే విశేష పుణ్యఫలం లభిస్తుందని ప్రశ్న జ్యోతిష్యులు, గణపతి ఉపాసకులు కటకం రాజమనోహర శర్మ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

హోంగార్డుల సంక్షేమానికి కృషి

- సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) : హోంగార్డుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తామని సిద్దిపేట సీపీ అనురాధ స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె జిల్లాలోని హోంగార్డ్స్ సిబ్బందితో కమిషనర్ కార్యాలయంలో దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడారు. సిబ్బందికి యూనిఫామ్ అలవెన్స్ త్వరలో అందజేస్తామని తెలిపారు. రెయిన్‌కోట్స్, హెల్త్‌కార్డు విషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. ప్రతీ ఒక్కరికీ హెల్త్‌ప్రొఫైల్ తయారు చేయనున్నట్లు వివరించారు. యూనిఫాం వేసుకున్న ప్రతి ఒక్కరికీ క్రమశిక్షణ చాలా ముఖ్యమని యూనిఫాంలో ఉన్న వారిని పదిమంది గమనిస్తూ ఉంటారని, విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి దర్బార్ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. హోంగార్డు సిబ్బందికి విధి నిర్వహణలో కానీ వ్యక్తిగతంగా కానీ ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తెలపాలని సూచించారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించే వారిని గుర్తించి అవార్డులు, రివార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, ధరణి కుమార్, ఆర్ఎస్ఐ బాలకృష్ణ, హోంగార్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, జిల్లాలో ఉన్న హోంగార్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలపై పటిష్ట నిఘా

గంజాయి, ఇతర మత్తుపదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని సీపీ అనురాధ హుస్నాబాద్ డివిజన్ పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె పోలీస్ కమిషనర్ కార్యాలయంలో హుస్నాబాద్ డివిజన్ పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతీ అధికారి నీతి నిజాయితీగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. వారాంతపు సంతలు జరిగే ప్రాంతాల్లో యూనిఫాంలో ప్రజలకు కనపడాలని చెప్పారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. నిజాయితీగా విధులు నిర్వహించని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో హుస్నాబాద్ ఏసీపీ సతీష్, హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, చేర్యాల సీఐ శ్రీను, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్ గౌడ్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్ఐలు మహేష్, రాజు, విజయ్ భాస్కర్, షేక్ మహబూబ్ పాల్గొన్నారు.

వడ్లు.. వానపాలు

ఆరుగాలం కష్టం కొట్టుకుపోయింది

అన్నదాత ఆరుగాలం శ్రమ వర్షం పాలైంది. కోత కోసి.. ఆరబెట్టి.. అమ్మకానికి సిద్ధం చేసిన వడ్లు వరద పాలయ్యాయి. కష్టపడి పండించిన పంట కళ్లముందే కొట్టుకుపోతుంటే రైతులు కన్నీరుమున్నీరయ్యారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి వారం పది రోజులవుతున్నా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతోనే వర్షం వెంటాడిందని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. సరిపడా టార్పాలిన్లు కూడా అందుబాటులో లేవని వాపోతున్నారు. నిబంధనల మేరకు తేమశాతం ఉండాలని వడ్లను ఆరబోస్తే మొదటికే మోసం వచ్చిందని లబోదిబోమంటున్నారు. వడ్లకు వర్షంతో ముప్పు పొంచి ఉందని.. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మూడ్రోజుల క్రితమే 'ఆంధ్రజ్యోతి' హెచ్చరించినా అధికార యంత్రాంగంలో చలనం లేకపోయింది..

- కొనుగోళ్లలో జాప్యం రైతులకు శాపం
- కేంద్రాల్లో తడిసిముద్దయిన వడ్లకుప్పలు
- కన్నీరుమున్నీరవుతున్న అన్నదాతలు
- కొనుగోళ్లు వేగవంతం చేయాలని
- ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'



చేర్యాల మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం కుప్పలపై నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న వృద్ధ రైతు దంపతులు



దుబ్బాకలో అకాలవర్షంతో తడిసిన ధాన్యం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, నవంబరు 1: మెతుకుసీమగా పేరొందిన ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్నం మెతుకులు పండించే రైతాంగానికి రంది పట్టుకుంది. ఓవైపు జోరుగా వరికోతలు ప్రారంభమైనప్పటికీ మరోవైపు అదేస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. సంగారెడ్డి జిల్లాలో 1.09 లక్షల ఎకరాలు, మెదక్ జిల్లాలో 2.99 లక్షల ఎకరాలు, సిద్దిపేట జిల్లాలో 3.60 లక్షల ఎకరాల్లో వరిపంట సాగుచేశారు. దాదాపు 10 లక్షల నుంచి 15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడానికి అంచనా వేశారు. అయితే 15 రోజుల క్రితం నుంచే రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. కానీ తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి కేంద్రాల నిర్వాహకులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. మిల్లర్లతో ఒప్పందం కుదరకపోవడమే ఇందుకు కారణమని అధికారవర్గాలు పేర్కొంటునప్పటికీ ఆ ప్రభావం రైతులపై పడుతోంది. మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు కేంద్రాల వద్ద ఆరబోసిన వడ్లు నీటిపాలయ్యాయి. కోతకు వచ్చిన పొలాలు

మిగతా 7వ పేజీలో..

దంచికొట్టిన వాన

- ఉమ్మడి మెదక్ జిల్లాలోనే అత్యధికంగా మునిగడపలో 5.5 సెంటీమీటర్ల వర్షపాతం

7లో

అభివృద్ధి పాఠాలు

- సిద్దిపేటలో పర్యటించిన 46 మున్సిపాలిటీల కమిషనర్లు
- సీడీఎంఏ సూచన మేరకు కదిలిన అధికార యంత్రాంగం
- రాష్ట్రంలోని ఐదు మున్సిపాలిటీల కన్నా.. ఎక్కువగా ఇక్కడికే
- సిద్దిపేట అభివృద్ధి సూపర్ అంటూ కితాబు..

సిద్దిపేటటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దేశంలో, రాష్ట్రంలో అభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తూ, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో, ఉత్తమ మున్సిపల్‌గా పలు రంగాల్లో దాదాపు 22 అవార్డులు సాధించిన సిద్దిపేట మున్సిపల్ ప్రగతిని చూసేందుకు అధికారులు సిద్దిపేట బాటపడుతున్నారు. రాష్ట్రంలోని ఐదు మున్సిపాలిటీలలో ఘన వ్యర్థాల నిర్వహణ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) అధ్యయనం చేయాలని మున్సిపల్ సీడీఎంఏ ఆదేశించింది. ఈ మేరకు సిద్దిపేట, మణికొండ, నార్సింగి, సూర్యాపేట, నారాయణపేట మున్సిపాలిటీలను సందర్శించాలని సూచించింది. అక్టోబరు 24 నుంచి 28 వరకు నాలుగురోజుల పాటు (ఆదివారం మినహా) రాష్ట్రంలోని 46 మున్సిపాలిటీలకు చెందిన కమిషనర్లు, అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో పర్యటించారు. ఇక్కడ చేపట్టిన, జరుగుతున్న అభివృద్ధిపై మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ వారికి వివరించారు.

ఇంటింటి చెత్త సేకరణ విజయవంతం కావడంపై, ప్రతి ఇంటి నుంచి వెలువబడుతున్న చెత్తను తడి, పొడి, హానికర చెత్తను ఏరకంగా వేరు చేసి ఇస్తున్నారో మున్సిపల్ కమిషనర్లు నేరుగా గృహ యజమానులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో ప్రతి శుక్రవారం, మంగళవారం పొడి చెత్త మిగతా వారాల్లో తడి చెత్త వేరు చేసి ఇచ్చే విధానాన్ని పరిశీలించారు. మేకలను ఎక్కడపడితే అక్కడ వధించకుండా పట్టణ శివారులో ఏర్పాటు చేసిన స్లాటర్ హౌజ్‌లో వధిస్తున్న తీరు, ఫ్రీజర్‌లో మాంసం నిల్వ చేసే ప్రక్రియ, మేకల వర్థ్యాలతో తయారుచేస్తున్న గ్యాస్‌పై ఆరా తీశారు. ఇంటింటి నుంచి సేకరించిన తడి చెత్తను సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో బుస్సాపూర్‌లో ఏర్పాటు చేసిన గృహ వ్యర్థాల నుంచి సీఎన్‌జీ గ్యాస్ ఉత్పత్తి చేసే బయో గ్యాస్ ప్లాంట్‌ను సందర్శించారు. మిథేన్ నుంచి సీఎన్‌జీను వెలికితీసిన తర్వాత గ్యాస్‌ను సిలిండర్లలో నింపే విధానాన్ని పరిశీలించారు. ఆ గ్యాస్ సిలిండర్లను ముందుగా సిద్దిపేటలోని హరిత హోటల్ (మినర్వా గ్రాండ్)కు తరలిస్తూ మున్సిపల్‌కు వస్తున్న ఆదాయాన్ని వివరించారు. చెత్త సమస్య పరిష్కారానికి బుస్సాపూర్ రిసోర్స్ పార్కులో బయో మైనింగ్ ప్రక్రియపై కమిషనర్లు, అధికారులు ఆరా తీశారు. బయోమైనింగ్ ద్వారా గతంలో వేసిన చెత్త, మట్టిని వేరు చేసి ఎరువు వచ్చేలా చేస్తున్న చెత్త శుద్ధిని తెలుసుకున్నారు. పాత వస్త్రాలను దహనం చేసే ఇన్సినేరేటర్‌ను పరిశీలించారు. హౌజింగ్ బోర్డు వద్దనున్న పొడి చెత్త సేకరణ కేంద్రాన్ని (డీఆర్‌సీసీ)ని సందర్శించి పొడి చెత్త ఎంత వస్తుంది, వచ్చిన పొడి చెత్తను కంప్రెష్ మిషన్ ద్వారా ముద్దగా తయారుచేసి విక్రయానికి తరలించడం వంటి విషయాలపై ఆరా తీశారు.

ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణతోపాటు ఆరోగ్య సమాజ నిర్మాణం కోసం అన్ని హంగులతో నిర్మించిన స్వచ్ఛబడిని అధికారులు సందర్శించారు. స్వచ్ఛబడి నిర్మాణంలో వ్యర్థాలతో రూపొందించిన ప్లాస్టిక్‌తో తయారైన ఇటుక, టైల్స్ తయారు చేసిన విధానంపై అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. స్వచ్ఛబడిలో, బుస్సాపూర్ డంపు యార్డులో సేకరించిన తడి, పొడి, హానికరమైన చెత్తగా వేరు చేయడం, చెత్తతో సంపదను సృష్టించడం, చెత్తతో ఇళ్లలో ఎరువుల తయారీపై చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ అవగాహన కల్పించారు. వ్యర్థ సామగ్రితో వివిధ కళాకృత్తులకు రూపకల్పన, సేంద్రియ ఎరువులతో పూల మొక్కలు, కూరగాయ

మిగతా 8వ పేజీలో...



డీఆర్‌సీసీలో సేకరించిన పొడి చెత్తను పరిశీలిస్తున్న అధికారులు



స్వచ్ఛబడిలో సిద్దిపేటమున్సిపల్ సాధించిన ప్రగతిని వివరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

బాధ్యతలు చేపట్టిన డీఎంఅండ్‌హెచ్‌వో పల్వాన్‌కుమార్

సిద్దిపేట టౌన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిగా డాక్టర్ పల్వాన్‌కుమార్ జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కార్యాలయ సిబ్బంది పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్, శ్రీనివాస్, డాక్టర్ రేవతి, ఏవో నవీన్‌రాజ్‌కుమార్, సూపరింటెండెంట్ అనిల్ కుమార్, సిబ్బంది అనిల్ కుమార్ పాల్గొన్నారు.



పల్వాన్‌కుమార్‌ను సన్మానిస్తున్న వైద్యశాఖ సిబ్బంది



హైరానా

- హైనా దాడుల్లో జీవాల మృత్యువాత..
- మరోవైపు కుక్కలతోనూ బెంబేలు
- మద్దూరు మండలంలో 200కు పైగా జీవాలు మృతి
- ఆర్థికంగా చితికిపోతున్న పెంపకందారులు

7

భళా.. బాలిక చిత్రకళా!

- వైకల్యాన్ని అధిగమించి ఒంటిచేతితో ప్రతిభ చూపుతున్న వివేకవర్ధిని
- ఆలోచింపజేస్తున్న చిత్రాలు

7





పండుగ వేళ అంధకారం

గుమ్మడిదల, నవంబరు (ఆంధ్రజ్యోతి) 1 : గుమ్మడిదల మండలంలో దీపాల పండుగ రోజు అంధకారం నెలకొన్నది. గురువారం రాత్రి ఆరున్నర ప్రాంతంలో పూజలు నిర్వహించే సమయంలోనే ఒక్కసారిగా కరెంటు పోయింది. పండగ రోజు ఇలా కరెంటు తీయడం ఏమిటని ప్రజలు విద్యుత్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కో అధికారులను ఫోన్ ద్వారా అడిగితే సమీపంలో విద్యుత్ వైర్లు తెగడంతో అంతరాయం కలిగిందని చెప్పారు. పూజ సమయం మించిపోతుండడంతో సెల్‌ఫోన్‌లలో టార్చ్ వేసుకుని నిర్వహించారు. రెండు గంటల తర్వాత కరెంటు రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

తూప్రాన్ డివిజన్‌లో 1,738 మంది పట్టభద్రులు దరఖాస్తు

తూప్రాన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ డివిజన్ పరిధిలో ఫారం- 18లో 1,738 మంది పట్టభద్రులు, ఫారం- 19తో 141 మంది ఉపాధ్యాయులు ఇప్పటి వరకు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కేంద్రం వద్ద ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను ఆయన సందర్శించారు. మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు 6వ తేదీ వరకు ఇంకా ఐదు రోజులే అవకాశం ఉందన్నారు. లింక్ ఓపెన్ చేసి ఫారం 18లో పట్టభద్రులు, ఫారం 19లో ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్లు సీజ్

గుమ్మడిదల, నవంబరు (ఆంధ్రజ్యోతి) 1 : అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను సీజ్ చేసినట్టు గుమ్మడిదల తహసీల్దార్ గంగాభవాని తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులతో నిఘా పెట్టి నాలుగు టిప్పర్లను పట్టుకున్నామని తెలిపారు. అనంతరం టిప్పర్లను పోలీస్‌స్టేషన్ తరలించి రూ.లక్ష జరిమానా విధించి ఇలాంటి అక్రమ తరలింపుకు పాల్పడరాదని హెచ్చరించినట్టు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మద్దూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాకర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ శుక్రవారం తెలిపారు. బైరాన్‌పల్లికి చెందిన పెర్క సంపత్ ఇసుక ట్రాక్టర్‌ను రేబర్తిలో, కమలాయపల్లికి చెందిప షేర్ల మహేష్‌కు చెందిన ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా అర్జున్‌పట్ల గ్రామంలో పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే చింతా

సంగారెడ్డి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా నియమితులైన తిరుమ తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్. నాయుడుని శుక్రవారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా 4న సుహాసినిరెడ్డి బాధ్యతల స్వీకరణ

నర్సాపూర్,నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా నియమాకమైన చిలుముల సుహాసినిరెడ్డి ఈనెల 4వ తేదీన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. చైర్‌పర్సన్‌గా నియమించి పదిరోజులు దాటుతున్నా అధికారికంగా బాధ్యతలు తీసుకోలేదు. ఈనెల 4న మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ సమక్షంలో బాధ్యతలు తీసుకోన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేసిన మాజీ ఎమ్మెల్యే

కల్హేర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఖానపూర్(కె) గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి శుక్రవారం లబ్ధిదారుడికి అందజేశారు. కంగ్టి మండల పరిధిలోని ఎడ్లరేగడి తండాకు చెందిన బన్సీలాల్‌కు మంజూరైన రూ.21 వేల చెక్‌ను అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు బలరాం, మంగళ్‌చాంద్, రైలా నాయక్, జగదీష్ తదితలరు ఉన్నారు.

'ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి'

హుస్నాబాద్ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏలోకి మార్చాలని శుక్రవారం ముదిరాజ్ సంఘం నాయకులు బీసీ కమీషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేశారు. కరీంనగర్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన బహిరంగ విచారణ సందర్భంగా హుస్నాబాద్ మండల ముదిరాజ్ సంఘం గౌరవాధ్యక్షుడు పెండ్యాల అయిలయ్య, మండల అధ్యక్షులు పొన్నబోయిన శ్రీనివాస్, ఎడల వనేష్‌లు కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు.

పేలుడు పదార్థాలు, పద్ధతులపై వర్క్‌షాప్

● ప్రధాన వక్తలుగా కేంద్ర విద్యాసంస్థలు, ఐఐటీ, ఎన్ఐటీ ప్రొఫెసర్లు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఓ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి వేదిక కాబోతోంది. 'మౌలిక సదుపాయాలు, గనులు, క్వారీ పరిశ్రమల కోసం 'పేలుడు పదార్థాలు, వాటిని వినియోగించే పద్ధతులపై రెండు రోజుల సాంకేతిక మార్పిడి వర్క్‌షాప్‌ను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో డిసెంబర్ 13, 14 తేదీల్లో నిర్వహించనున్నది. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి, నిర్వాహకుడు డాక్టర్ సీహెచ్.అఖిలేష్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రాజెక్టు మేనేజర్లు, ఇంజనీర్లు, నియంత్రణ సంస్థలు, కాంట్రాక్టర్లు, తయారీదారులు, పరిశోధకులు తదితరులు 'పేలుడు పరిజ్ఞానంలో మెలకువలు, అనుభవాలు, ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి ఈ కార్యక్రమం వీలుకల్పిస్తుందని తెలిపారు. భారతీయ పరిశ్రమ 'పేలుడు పద్ధతులను మెరుగుపరచడానికి వ్యూహాలను రూపొందించే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర విద్యాసంస్థలు, ఐఐటీ, ఎన్ఐటీ ప్రొఫెసర్లు, నిపుణులు ప్రధానవక్తలుగా హాజరవుతారని తెలిపారు.

క్రైం కార్నర్

ఖేడ్‌లో యువకుడి దారుణ హత్య



ఖేడ్- అంత్వార్ రహదారి మార్గంలో ఘటనా స్థలిని పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ సంజీవ్‌రావు

నారాయణఖేడ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఖేడ్ - అంత్వార్ మార్గంలోని జూక్కల్ శివారులో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఖేడ్ పట్టణానికి చెందిన వ్యక్తులు మార్నింగ్‌వాక్‌లో భాగంగా అంత్వార్ మార్గంలో నడుచుకుంటూ వెళ్తుండగా, రోడ్డుపై ఓ వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని నారాయణఖేడ్ మండలం ర్యాలమడుగుకు చెందిన దొంతిగారి మహేష్(32)గా గుర్తించారు. మహేష్ కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. గుర్తుతెలియని వ్యక్తులు హత్యచేసి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు చిత్రీకరించేందుకు మృతదేహాన్ని ఇక్కడి వరకు ఈడ్చుకువచ్చినట్లు ఆనవాళ్లున్నాయి. సంఘటన స్థలాన్ని అదనపు ఎస్పీ సంజీవ్‌రావు సందర్శించారు. క్లూస్ టీంతో ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొని ఒకరి మృతి



మృతిచెందిన పీరయ్య(ఫైల్)

పెద్దశంకరంపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న ఆటోను బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెంది. సంఘటన పెద్దశంకరంపేట పట్టణ సమీపంలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్నది. పేట ఏఎస్‌ఐ విఠల్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దశంకరంపేట మండల పరిధిలోని గొట్టిముక్కుల గ్రామానికి చెందిన తలారి పీరయ్య(36) అల్లాదుర్గంకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా తిరుమలాపూర్ 161వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నాడు. పీరయ్యకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108లో జోగిపేట వైద్యశాలకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. పీరయ్య భార్య తలారి సంతోషి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో అదుపు తప్పడంతో మరొకరు..

రాయికోడ్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆటో అదుపు తప్పి పడడంతో యువకుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం నాగూర్‌కె గ్రామానికి చెందిన పండరి(25) ఆటోలో ప్రయాణిస్తున్నాడు. శంషొద్దీన్‌పూర్ గ్రామ శివారులో పండరి ప్రయాణిస్తున్న ఆటో అదుపు తప్పి పడడంతో అందులో ప్రయాణిస్తున్న పండరి అక్కడికక్కడే మృతిచెందాడు. పండరి తండ్రి దిలీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నారాయణ తెలిపారు.

పౌల్ట్రీఫామ్‌లో పని కోసం వచ్చిన యువకుడు..

శివ్వంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం పౌల్ట్రీఫామ్‌లో పనిచేయడానికి వచ్చిన యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం సికింద్లాపూర్ శివారులో చోటుచేసుకున్నది. యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సాకు చెందిన సానుహో(23), అజిత్ అక్టోబర్ 26న సికింద్లాపూర్ శివారులోని మారుతి ప్రసాద్ పౌల్ట్రీఫామ్‌లో పనిచేయడానికి వచ్చారు. అజిత్‌కు ఆధార్‌కార్డు ఉండడంతో పనిలో చేరాడు. సానుహో తీసుకురాకపోవడంతో పనిలో చేర్చుకోలేదు. ఆధార్ కార్డు వచ్చేంతవరకు సానుహో అజిత్ రూంలోనే ఉంటున్నాడు. అక్టోబర్ 30న సాయంత్రం 6 గంటలకు సానుహో పడుకొని ఉండగా, మిగతావారు పనికి వెళ్లివచ్చి చూడగా చనిపోయి ఉన్నాడు. యజమాని మారుతి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి ఒకరు..

పాపన్నపేట, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటమునిగి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని ఆబ్లాపూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీరుడి నాగయ్య(63) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం చేపలు పట్టేందుకు గ్రామ శివారులో ఉన్న ఈదుల చెరువు వద్దకు వెళ్లాడు. అలుగు వద్ద చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి నీట మునిగి మృతిచెందాడు. రాత్రయినా ఇంటికి రాకపోయేసరికి కుటుంబీకులు చెరువు వద్ద వెతికారు. చెరువు ఒడ్డుపై నాగయ్య దుస్తులు, చెప్పులు కనిపించాయి. స్థానికుల సాయంతో చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుమారుడు దశరథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భళా.. బాలిక చిత్రకళా!



ఒంటిచేత్తో బొమ్మలు వేస్తున్న వివేకవర్ధిని

- ఒంటిచేతితో ప్రతిభ చూపుతున్న వివేకవర్ధిని
- ఆలోచింపజేస్తున్న చిత్రాలు

దుబ్బాక, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆ బాలిక ఒంటిచేతితోనే అందమైన బొమ్మలు వేస్తూ ప్రతిభను కనబరుస్తున్నది. సామాజిక సందేశాన్ని అందించే చిత్రాలు గీస్తూ మన్ననలు అందుకుంటుంది. ఆమె ఒక చేతులేకుండానే పుట్టిన దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామానికి చెందిన కోమటిరెడ్డి వివేకవర్ధిని. దుబ్బాకలోని ఆదర్శ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న వివేకవర్ధిని కుంచెతో సమాజంలోని రుగ్మతలపై ఆలోచింపజేస్తుంది. విద్యార్థులకు, బాలికలకు సమాజం పట్ల అవగాహన కల్పించే చిత్రాలతో జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచింది. కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఏటా నిర్వహించే కళాఉత్సవ్‌లో చిన్నారి వివేకవర్ధిని చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



వివేకవర్ధిని గీసిన చిత్రం

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే..

ఆదర్శ పాఠశాలలోని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దయాకర్‌రెడ్డి, దేవవ్వ ప్రోత్సాహంతో చిత్రలేఖనంలో రాణిస్తున్నాను. నాకు సహాయం అందించి, కృత్రిమ చేతును ఏర్పాటు చేస్తే, సమాజంలో నాకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటాను.

- వివేకవర్ధిని

హైరానా

హైనా దాడుల్లో జీవాల మృత్యువాత.. తరచూ ఘటనలు



లద్నూరులో హైనాల దాడిలో మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- మరోవైపు కుక్కలతోనూ బెంబేలు
- మద్దూరు మండలంలో 200లకు పైగా జీవాలు మృతి
- ఆర్థికంగా చితికిపోతున్న పెంపకందారులు

మద్దూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవాల మందలపై హైనాల దాడులతో గొర్రెల, మేకల పెంపకందార్లు ఆర్థికంగా చితికిపోతున్నారు. సబ్సిడీ గొర్రెల పంపిణీతో మంద, సంపద పెరిగినా.. కుక్కల బెడదతో ఆ సంతోషం ఆవిరైపోతున్నది. తరచూ దాడులతో పెంపకందార్లకు కంటిమీద కునుకులేకుండా పోయింది. మద్దూరు మండలంలోని వంగపల్లి, లద్నూరు, మద్దూరు తదితర గ్రామాల్లో ఈ ఏడాది హైనాలు, కుక్కల దాడులతో 200లకు పైగానే గొర్రెలు మృత్యువాత పడ్డాయి.

మండలానికి 1071 యూనిట్లు

మద్దూరు ఉమ్మడి మండలానికి 1071 గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. బైరాన్‌పల్లి, మద్దూరు గ్రామాల్లో పశు వైద్య కేంద్రాలుండగా సలాఖ్‌పూర్, లద్నూరు గ్రామాల్లో ఉపకేంద్రాలున్నాయి. ప్రభుత్వం గొర్రెల, మేకలకు ఏటా వాక్సినేషన్‌తో పాటు డీ వార్మింగ్ డే సందర్భంగా నట్టల నివారణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారులు చెబుతున్నారు. మొబైల్ వాహనం ద్వారా సేవలు అందుతున్నట్లు వివరించారు. ఉమ్మడి మండలంలో సుమారు 30 వేలకు పైగానే గొర్రెలు, మేకలు ఉన్నాయి.

రుణంతో కొన్న గొర్రెలు చనిపోయాయి



బ్యాంకులో ముద్ర రుణాన్ని పొంది 100 గొర్రెలను కొనుగోలు చేసి వ్యవసాయ పొలం వద్ద ప్రత్యేకంగా షెడ్డులో పెంచుతున్నాం. కొన్ని నెలల్లో రెండుసార్లు హైనాలు దాడులు చేసి సుమారు 40 గొర్రెలను చంపాయి. ఫారెస్ట్ అధికారులతో పాటు వెటర్నరీ వైద్యాధికారులకు సమాచారం అందించాం. పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం నుంచి ఇంకా ఆర్థిక సాయం అందలేదు.

-కోడూరు సిద్దిఖ్, మద్దూరు

81 గొర్రెలు మృత్యువాత పడ్డాయి



వేట కుక్కల దాడుల్లో సుమారు 81 గొర్రెలు మృత్యువాతపడడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఫారెస్ట్ అధికారులతో పాటు వెటర్నరీ వైద్యాధికారి సమాచారం అందించాం. దరఖాస్తు ఇచ్చాం. ఇప్పటి వరకు ఎలాంటి సహాయం అందలేదు. సుమారు రూ.10 లక్షలపైనే నష్టపోయాం. వెంటనే పరిహారం అందించాలి.

-నంగి చంద్రయ్య, పెంపకందారుడు, మద్దూరు



మద్దూరులో కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలు(ఫైల్)

వెంటనే సమాచారం అందించాలి



హైనాల దాడుల్లో గొర్రెల, మేకలు మృతిచెందితే వెంటనే అటవీ శాఖ అధికారులతో పాటు పశువైద్యాధికారులకు సమాచారం అందించాలి. గ్రామ ప్రజాప్రతినిధుల, సెక్రటరీల సమక్షంలో ఘటనా స్థలంలోనే పంచనామా నిర్వహిస్తాం. పశువైద్యాధికారి పోస్టుమార్టం చేసి ధ్రువపత్రంతో పాటు వాల్యుయేషన్ సర్టిఫికెట్ అందిస్తారు. దరఖాస్తుకు పెంపకందారుల రెండు ఫొటోలు, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ ప్రతులను జతచేసి సమర్పిస్తే ఆర్థిక సాయం కోసం ప్రభుత్వానికి నివేదిస్తాం.

- సందీప్‌కుమార్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

కేటీఆర్.. అమెరికా వెళ్లి బాత్‌రూమ్‌లు కడుక్కో

- పొంగులేటి చెప్పినట్లు ఎలాంటి బాంబు పేలలేదు
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కేటీఆర్.. అమెరికా వెళ్లి బాత్‌రూమ్‌లు కడుక్కో అని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. సంగారెడ్డి చౌరస్తా సమీపంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సభ్యత్వ నమోదు వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేటీఆర్ రాజకీయాలు బంద్ చేయాలని అంటున్నారని, ఎవరూ వద్దు అనలేదన్నారు. అధికారంలో ఉన్న పదేళ్లు కేటీఆర్ ప్రజలను కలిసే సమయం దొరకలేదని దుయ్యబట్టారు. కేటీఆర్ తండ్రి 10 నెలలుగా ఫామ్‌హౌజ్‌లో ఉన్నారని ఏమైనా నష్టం జరిగిందా అని ప్రశ్నించారు. కేటీఆర్ వచ్చింది ప్రజల కోసం కాదని, డబ్బు, అధికారం, ఫామ్‌హౌస్ కోసం వచ్చారన్నారు. కాంగ్రెస్ పది నెలలపాలనే విసుగొస్తే పదేళ్ల ప్రజలు మిమ్మల్ని ఎలా భరించారని మండిపడ్డారు. కేటీఆర్ మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు విశ్వసించరన్నారు. తన నాన్న, చెల్లి, బావతో పాటు ఎవరిపై నమ్మకం లేదని దుయ్యబట్టారు. ఫామ్‌హౌజ్ కేసులో పాలేవో.. నీళ్లేవో తెలాలంటే సీసీ ఫుటేజీ బయటపెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఆడవాళ్లు తాగుతారని కోరుట్ల ఎమ్మెల్యే అంటున్నారని, తెలంగాణలో ఎక్కడైనా ఆడవాళ్లు తాగుతారా అని ప్రశ్నించారు. దీపావళికి పొంగులేటి చెప్పినట్లు ఎలాంటి బాంబు పేలలేదని రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. క్రియాశీల సభ్యత్వాలలో సంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉండాలని రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్త 100 సభ్యత్వాలు పూర్తి చేసుకుని క్రియాశీల సభ్యత్వాన్ని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి లక్ష్మీనర్సయ్య, జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంతరావు, రాజశేఖర్‌రెడ్డి, ఉపాధక్షులు వెంకటనర్సింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాయకలు పాల్గొన్నారు.

సామాన్యులకు సంక్షేమాన్ని దరిచేర్చిన ధీరవనిత ఇందిరాగాంధీ

- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు రూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని నిర్మూలిస్తేనే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని 'గరీబీ హటావో దేశ్ కో బచావో' నినాదంతో పేదలకు సంక్షేమాన్ని దగ్గరకు చేసిన ధీరవనిత మాజీ ప్రధాని భారతరత్న ఇందిరాగాంధీ అని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ కొనియాడారు. ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని చిట్కుల్‌లో ఆయన నివాసంలో ఆమె చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూడు, గూడు గుడ్డలేని నిరుపేదలకు సాగు భూములను పంచడమే కాకుండా పక్కా గృహాలను నిర్మించి కోట్లాది మంది భారతీయుల గుండెల్లో పదిలంగా నిలిచిపోయారన్నారు. ఇందిరాగాంధీ చేపట్టిన హరిత విప్లవంతో ప్రపంచానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా దేశాన్ని నిలబెట్టారన్నారు. ఆనాడు ముందుచూపుతో చేపట్టిన సంక్షేమ పథకాల ఫలితంగా దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఇందిరమ్మ పాలన స్ఫూర్తితో తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తూ అన్ని వర్గాలకు సంక్షేమాన్ని అందిస్తున్నారని స్పష్టం చేశారు.

వరుసగా పోటీ పరీక్షల్లో విఫలం.. మనస్తాపంతో యువకుడి బలవన్మరణం



సోము శంకర్ (ఫైల్)

బెజ్జంకి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ సహా పలు పోటీ పరీక్షలు రాసినా ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామంలో దీపావళి పండుగ రోజు ఈ ఘటన వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సోము శంకర్ (33) పీజీ చదివాడు. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రతీ పోటీ పరీక్షను రాశాడు. ఇటీవల డీఎస్సీ రాసినా ఉద్యోగం రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై నాలుగు రోజుల క్రితం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. దుర్వాసన వస్తుండటంతో గురువారం స్థానికులు ఇంట్లోకి వెళ్లి చూడగా, ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. సోము శంకర్ తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితమే చనిపోగా, ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. సోదరుడు సోము రమేష్ రాజన్న సిరిసిల్ల జిల్లాలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. రమేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

తండ్రి భూమి తన పేరిట మారలేదని కుమారుడి ఆత్మహత్య

దుబ్బాక, నవంబరు1(ఆంధ్రజ్యోతి): తండ్రి తదనంతరం తనకు రావల్సిన భూమి సాంకేతిక కారణాలతో మార్పిడి జరగకపోవడంతో మనస్తాపానికి గురైన కుమారుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామంలో గురువారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన పోషిగారి అంజయ్య కుమారుడు స్వామి (39) వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నారు. తండ్రి అంజయ్య నెలరోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. కుమారుడికి చెందాల్సిన వ్యవసాయ భూమి తండ్రి పేరు మీద నుంచి సాంకేతిక కారణాలతో మార్పిడి జరగడంలేదని తెలిసి మనోవేదనకు గురయ్యాడు. మద్యానికి బానిసగా మారిన స్వామి తరుచూ, తన పేరుతో భూమి మార్పిడి జరగడంలేదని తెలిసిన వారు అందరి వద్ద ఆవేదన వ్యక్తం చేసేవారు. గురువారం రాత్రి అందరూ పడుకుని ఉండగా, ఇంట్లో నుంచి వెళ్లిన స్వామి కోటగారి రామవ్వ మర్రిచెట్టుకు లుంగీతో ఉరేసుకున్నాడు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వడ్లు.. వానపాలు

ఐదో పేజీ తరువాయి

నేలకొరుగుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన అన్నదాత కోలుకోలేనంత నష్టపోతున్నాడు.

కళ్లముందే నీటిపాలైన వడ్లు

- టేక్మాల్ మండలం పల్వంచకు చెందిన చాకలి సిద్దు ఆరు ఎకరాలను కౌలుకు తీసుకొని సన్నరకం వరి సాగుచేశాడు. కోత కోసి ఆరబెట్టగా 20 సంచుల వడ్లు వరద పాలయ్యాయి.
- మెదక్ మార్కెట్ యార్డులో విక్రయించడానికి తెచ్చిన ధాన్యం వర్షానికి తడిసిముద్దయ్యింది. సమయానికి కొనుగోళ్లు చేపట్టకపోవడం వల్లేనని రైతులు ఆరోపించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.
- నారాయణరావుపేట ఐకేపీ కేంద్రంలో కొనుగోళ్ల జాప్యం కావడంతో పెద్ద ఎత్తున వడ్లకుప్పలు వర్షానికి తడిసాయి.
- అల్లాదుర్గం మండలం రాంపూర్, కాయిదాంపల్లిలో ఆరబోసిన ధాన్యం కుప్పలు అకాల వర్షానికి నీటిపాలయ్యాయి. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు వేడుకున్నారు.
- వెల్దుర్తి మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో అకాల వర్షానికి ధాన్యం కుప్పల వద్ద వరద ముంచెత్తింది. ఇక రహదారులపై ఆరబెట్టిన ధాన్యం చెల్లాచెదురైంది.
- చిలప్‌చెడ్ మండలం అజ్జమర్రిలో ధాన్యం తడిసిముద్దయ్యింది. వడ్లకుప్పల చుట్టూ వరదనీరు చేరింది.
- హవేళీఘనపూర్‌లోని కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యం వర్షానికి తడిసింది. కొనుగోలుకు సిద్ధమైన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టడంపై రైతులు నిమగ్నమయ్యారు.
- కౌడిపల్లిలో వారం రోజుల క్రితం తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో తడిసి ముద్దయ్యిందని రైతు రెడ్డి నర్సింహులు ఆవేదన చెందారు.
- నర్సాపూర్ మండలంలోని ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలకు రైతులు పెద్ద ఎత్తున ధాన్యం తెచ్చారు. ఇంకా కొనుగోలు ప్రారంభించ లేదు. శుక్రవారం చిరుజల్లులు కురవగా రైతులే రక్షణ చర్యలు చేపట్టారు.
- మెదక్ జిల్లా నిజాంపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిముద్దయ్యింది. రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయనందునే ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.
- పాపన్నపేట మండలంలో భారీ వర్షం కురియడంతో ఆరబోసిన ధాన్యం తడిసింది. మండలంలో సుమారుగా 30 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా.. ఇప్పటివరకు 10 శాతమే వరి కోతలు పూర్తయ్యాయి. చాలా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఇంకా తెరుచుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు.
- హత్నూర మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఆరబోసిన వడ్లు తడిసిపోయాయి. పలు గ్రామాల్లో కోతకు వచ్చిన వరి నేలకొరిగింది.
- రామాయంపేటలో గురువారం 25 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పట్టణంలోని సిద్దిపేట రహదారి, మార్కెట్ యార్డులో వారం రోజులుగా ఆరబోసిన ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోయింది. పది రోజులుగా కొనుగోళ్లు లేకపోవడంతోనే నష్టపోవాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు.
- కుకునూరుపల్లి మండలం లకుడారం కొనుగోలు కేంద్రంలో ధాన్యం నీటిపాలైంది. రెండెకరాల వరిసాగు చేసి గింజలు తెచ్చానని, కొనుగోలు చేయక వర్షానికి తడిసాయని బొబ్బాయిపల్లికి చెందిన రైతు సున్నం నర్సింహులు ఆవేదన చెందాడు.
- చేర్యాల మార్కెట్ యార్డులో ధాన్యం నీటిపాలైంది. పదిరోజుల క్రితం తెచ్చిన ధాన్యాన్ని కనీసం తేమ కూడా చూడలేదని, పట్టించుకోలేదని.. చివరకు వర్షానికి తడిసి ఆగమైందని వృద్ధ మహిళా రైతు ముస్త్యాల వజ్రవ్వ రోదించింది.



చిలప్‌చెడ్ మండలం అజ్జమర్రిలో వరదనీటిలో ధాన్యం కుప్పలు

- మనోహరబాద్ మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో దండుపల్లి వద్ద కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. 10 గ్రామాల నుండి రైతులు ధాన్యం తెచ్చి రోడ్డుపై ఆరబోసి ఇక్కడే విక్రయిస్తారు. దాదాపు 2 కిలోమీటర్ల దూరం ఆరబెట్టిన ధాన్యమంతా తడిసి ముద్దయ్యింది.
- దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడిసిముద్దవడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

కొనుగోళ్లకు ఎదురుచూపులు

ధాన్యాన్ని ఎప్పుడెప్పుడు కొనుగోళ్లు చేస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు. పేరుకు మాత్రం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ ప్రారంభించలేదు. ఎలాగూ కేంద్రాలను ప్రారంభించారని రైతులు తమ ధాన్యం నిల్వలను తరలిస్తున్నారు. అక్కడక్కడ మాత్రమే తేమ శాతం పరీక్షించి తూకం వేస్తున్నారు. చాలాచోట్ల కనీసం ధాన్యాన్ని పట్టించుకున్న నాథుడే లేడు. టార్పాలిన్లు సైతం అందుబాటులో ఉంచడం లేదు. దీంతో తెచ్చిన ధాన్యం తడిసిముద్దవుతున్నా చోద్యం చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత జిల్లాల కలెక్టర్లు రంగంలోకి దిగాల్సిన అవసరం ఉంది. మిల్లర్ల చర్చలు పక్కనబెడితే కనీసం వర్షాల గురించి రైతులకు హెచ్చరికలు జారీ చేయడం వల్ల వారు అప్రమత్తంగా ఉంటారనే అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి.

దంచికొట్టిన వాన

- సిద్దిపేట జిల్లా మునిగడపలో 5.5 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం

మెదక్ అర్బన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు చోట్ల శుక్రవారం వాన దంచికొట్టింది. మోస్తనుంచి భారీ వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా మునిగడపలో అత్యధికంగా 5.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మెదక్ జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది.

వర్షపాతం ఇలా..

సిద్దిపేట జిల్లా చీకోడ్ 2.7 సెం.మీ., మిరుదొడ్డి 2.5 సెం.మీ., పోతిరెడ్డిపేట 2.4 సెం.మీ., కొడకండ్ల 2.2 సెం.మీ., మెదక్ జిల్లా చిన్నశంకరంపేటలో 3.8 సెం.మీ., నార్సపూర్ 1.7 సెం.మీ., సంగారెడ్డి రామచంద్రపురంలో 2.2 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది.

పిడుగుపాటుకు 25 మేకల మృతి

కల్హేర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు 25 మేకలు మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం బీబీపేటలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన మొల్ల ఇస్మాయిల్ రోజూలాగే గురువారం మేకల మందను మేతకు తోలుకు వెళ్లాడు. సాయంత్రం అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో వర్షం కురియడంతో మేకలు చెట్టు కిందకు చేరాయి. అదే సమయంలో పిడుగు పడడంతో 25 మేకలు మృతి చెందాయి. మేకలు మేపుతున్న ఇస్మాయిల్‌కు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. రూ.1.80 లక్షల మేర నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

రాయపోల్/గజ్వేల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాయపోల్ మండలం పెద్ద ఆరేపల్లిలో శుక్రవారం చోటుచేసుకున్నది. రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రామన్నగారి రవి (43) కొన్నాళ్ల క్రితం గ్రామంలో 20గుంటల భూమిని కొనుగోలు చేశాడు. అందుకు చేసిన అప్పులు తీర్చే మార్గం లేక, భూమిని అమ్మకానికి పెట్టాడు. భూమి కొనుగోళుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో వ్యవసాయ భూమి వద్ద శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య స్వప్న, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మరో ఘటనలో..

దుబ్బాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతరెడ్డిపేటలో శుక్రవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన తుమ్మల దేవాదాసు (59) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ విషయమై చాలా రోజులుగా మానసిక వ్యథను అనుభవిస్తున్నాడు. పోతరెడ్డిపేట పెద్దచెరువు వద్దకు వెళ్తుండగా ఆదే గ్రామానికి చెందిన అప్పనపల్లి స్వామి అనే వ్యక్తి గమనించి, పెద్దకుమారుడికి ఫోన్‌చేసి సమాచారం అందించారు. కుటుంబీకులు వచ్చే సరికి అతడు చెరువులో దూకేశాడు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. భూంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

గజ్వేల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ శివారులోని సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాల వద్ద చోటుచేసుకున్నది. గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపిన వివరాల ప్రకారం.. సురభి కళాశాల వద్ద శుక్రవారం ఉదయం 3గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తల ఛిద్రమైందన్నారు. వెంటనే మృతదేహాన్ని గజ్వేల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 30 నుంచి 35ఏళ్ల వరకు ఉంటుందని, వైలెట్ కలర్ టీషర్ట్, కుడి చేతిపై జలంధర్ అని టాటో ఉందన్నారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే 8712667331, 8712667460 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.



హార్వెస్టరుతో కొనసాగుతున్న వరి కోత

శరవేగంగా వరికోతలు

- వాతావరణంలో వచ్చిన మార్పులతో ఆందోళన
- వర్షాల ఉధృతి పెరగక ముందే మొదలు
- కిరాయి అధికంగా ఉన్నా హార్వెస్టర్లతో పనులు, పక్క జిల్లాల నుంచీ హార్వెస్టర్లు

సిద్దిపేట రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులు రావడంతో సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లో రైతులు వరికోతలు ముమ్మరం చేశారు. అకాల వర్షం కారణంగా చేతికందిన పంట నేలకు వాలి ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతో హార్వెస్టర్లతో వరి కోతలు సాగిస్తున్నారు. రెండు మండలాల్లో ఇప్పటికే 25 శాతం కోతలు పూర్తయ్యాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలపై ఆధారపడిన రైతులు ధాన్యాన్ని ఆరబెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. వరి కోతలు ఎక్కువగా ఉండడంతో స్థానికంగా ఉన్న హార్వెస్టర్లతో పాటు పక్కనే ఉన్న రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల నుంచి అదనంగా తెప్పించుకుని కోతల వేగాన్ని పెంచుతున్నారు. అక్కడక్కడ చిన్నపాటి వర్షాలు కురిసినా కొంత సమయం తీసుకుని వరి కోతలు కొనసాగిస్తున్నారు.

గంటకు రూ. 2వేలు.. ఆపైనే..

వాతావరణంలో మార్పులతో రైతులు అప్రమత్తం అయినప్పటికీ అకాల వర్షం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. ఓ వైపు హార్వెస్టర్లతో వరికోత పనులు చేస్తున్నప్పటికీ వర్షం వచ్చి అడ్డంకులు సృష్టిస్తుండడంతో రైతులు సతమతమవుతున్నారు. వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు హార్వెస్టర్లకు కిరాయి ఎంతైనా ఇచ్చేందుకు వెనకాడట్లేదు.

టూ వీలర్ హార్వెస్టర్‌కు గంటకు వరి కోతకు రూ. 2000 వేల నుంచి రూ.2200ల వరకు, ఫోర్ వీలర్‌కు రూ.2800ల నుంచి రూ. 3000ల వరకు కిరాయిని హార్వెస్టర్ యజమానులు నిర్ణయించినట్లు సమాచారం. అయినప్పటికీ రైతులు వెనకడుగు వేయకుండా వరి కోతలు త్వరగా పూర్తి చేసేందుకు సిద్ధం అవుతున్నారు.



ధాన్యాన్ని ట్రాక్టరులో తరలిస్తున్న రైతులు

వర్షాలతో ఆటంకం

వర్షం కారణంగా వరికోతలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నది. ఓ వైపు అకాల వర్షం మరో వైపు ధాన్య తేమ శాతంపై కొనుగోలు కేంద్రాల్లో ఆంక్షలు విధించడంతో నానాఅవస్థలు పడుతున్నాం. వరి కోతలు జోరుగా సాగుతుండడంతో హార్వెస్టర్లకు డిమాండ్ బాగా పెరిగింది. అయినా ఖర్చులకు వెనకడుగు వేయకుండా వరి కోతలు చేపడుతున్నాం.

- శంకరయ్య, రైతు, నారాయణరావుపేట

వెలుగుల పండుగ

దీపావళి సంబురాలు జిల్లాలో అంబురాన్నంటాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ వెలుగుల పండుగను గురువారం సంతోషంగా జరుపుకున్నారు. టపాసులు పేల్చి స్వీట్లు పంచుకుని ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇళ్లను దీపాలతో అలకరించారు. ఇంటి ముందు రంగురంగుల చిచ్చు బుడ్లు, భూ చక్రాలు, కాకర పావ్వొత్తులు ఇలా తీరొక్క టపాసులను కాల్చి చిన్నారులు తెగ సంబురపడ్డారు.

- న్యూస్ నెట్‌వర్క్



చిన్నకోడూరులో టపాసులు కాలుస్తున్న చిన్నారులు



చేర్యాల: మల్లన్న ఆలయంలో దీపాలంకరణ చేసిన అర్చకులు



సిద్దిపేట కల్చరల్: దుకాణాల ముందు టపాసులు పేల్చుతున్న చిన్నారులు

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- తహసీల్దారుకు వినతిపత్రం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చేర్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల దృష్ట్యా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరుతూ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పలు గ్రామాల రైతులు చేర్యాల తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కత్తుల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. చేర్యాల మండలంలో పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా కొనుగోలు చేపట్టకపోవడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారని, అకాలవర్షాలతో ధాన్యం తడుస్తూ నష్టపోతున్నారని వాపోయారు.

టపాసుల చెత్త శుభ్రం చేసిన చైర్‌పర్సన్

హుస్నాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది కంటే ఈసారి బాణాసంచా తక్కువ కాల్చి పర్యావరణాన్ని రక్షించేందుకు పట్టణ ప్రజలు సహకరించారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. స్వచ్ఛ్ దీపావళి, శుభ్ దీపావళి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని శివాజీనగర్, రైతు బజార్ ప్రాంతాల్లో కాల్చిన టపాసుల చెత్తను ఆమె శుభ్రం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు వాల సుప్రజ, అయిలేని శంకర్‌రెడ్డి, ఎండీ. అయూబ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాధవరెడ్డి, సుధాకర్, రవీందర్ తదితరులున్నారు.

'మాలల పట్ల జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాలి'

నంగునూరు,నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాలల పట్ల జరుగుతున్న కుట్రలను తిప్పి కొట్టేందుకు ఐక్యంగా ఉండి పోరాడాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ గుడిమల్ల సత్తయ్య కోరారు. మండలంలోని పాలమాకులలో శుక్రవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెర్క రాజకుమార్, ఉపాధ్యక్షులుగా వంగ సంపత్, తోటపల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా తలారి నగేశ్, సహాయ కార్యదర్శులుగా ఎర్ర రాజు, వంగ రవి, కోశాధికారిగా వంగ కనకయ్య, కార్యవర్గ సభ్యులుగా పెర్క కనకయ్య, తలారి లక్ష్మయ్య, నర్సయ్య, ఎర్ర పోచయ్య, బాబు, పేర్క నవీన్, ప్రచార కార్యదర్శి తోటపల్లి రాజ్‌కుమార్, సలహాదారులుగా రాగుల సారయ్య, ఎర్ర యాదయ్య కుమార్, మల్లయ్య, యాదయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.శ్రీనివాస్, అల్లిబిల్లి నర్సిగారావు, కిరణ్ యాదగిరి, నాయకులు రాంబాబు, రాజు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

దుద్దెడలో పద్మశాలి చేనేత శోభాయాత్ర



శోభయాత్రలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, పద్మాశాలి సంఘం సభ్యులు

కొండపాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెడలో దీపావళి సందర్భంగా దుద్దెడ పద్మశాలి చేనేత సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవతలు అయిన ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మ మార్కండేయ శోభయాత్రను గురువారం నిర్వహించారు. పద్మశాలి సంఘం సభ్యులు ప్రత్యేక వాహనంపై మగ్గంపెట్టి చీరలను వేసుకుంటూ గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు. నేసిన చీరలను అమ్మవార్లకు సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ సర్పంచ్ పెద్దంకుల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొజ్జమహదేవ్, వడ్లకొండ శ్రీనివాస్, బింగి భాస్కర్, గోనె శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

- సిద్దిపేట జిల్లా సీపీఎం కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా విధులు నిర్వహించాల్సిన కొమురవెల్లి ఎస్ఐ రాజుగౌడ్ కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న విషయమై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశాడు. కొమురవెల్లి మండలం మర్రిముచ్చాలలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతిపక్ష నాయకుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, కాంగ్రెస్ నేతలకు ప్రాధాన్యతనిస్తున్నాడని ఆరోపించారు. ఎస్ఐ వ్యవహారశైలిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నక్కల యాదవరెడ్డి, సురేందర్‌రెడ్డి, పబ్బోజు దుర్గయ్య, పాశికంటి బాలరాజు, బూర్గు సత్తయ్య, మేరుగు నరేశ్, బోయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత శిక్షణ కేంద్రాన్ని వినియోగించుకోవాలి'

సిద్దిపేటఅర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి నెల రోజులపాటు జరిగే ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని యూనియన్ బ్యాంకు ఆఫ్ సిద్దిపేట రీజినల్ హెడ్ వికాస్ కోరారు. సిద్దిపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉచితంగా నెలరోజుల పాటు మగ్గం వర్క్స్, బోటిక్ మేనేజ్మెంట్, ఉమెన్స్ బ్యూటీ పార్లర్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 నుంచి 40 సంవత్సరాల లోపు వయసున్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న మహిళలు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, మూడు పాసుపోర్టు సైజ్ ఫొటోలు, బ్యాంక్ పాస్‌బుక్, పదోతరగతి మెమోతో సంబంధిత కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్ రాజలింగం, లీడ్ డిస్టిక్ మేనేజర్ శ్రీహరి బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ వర్ధంతి

దేశ మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు గురువారం జరుపుకున్నారు. ఆమె చిత్రపటాలకు నివాళులర్పించారు.

- న్యూస్ నెట్‌వర్క్



కొండపాక: ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



మద్దూరు: ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కలుపుతారా?

- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామంటున్న రేవంత్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణను కలిపేద్దామని ప్లాన్ చేస్తున్నారా? అని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రాణత్యాగం వరకు వెళ్లి రాష్ట్రాన్ని సాధించడంతో పాటు పదేళ్ల పాటు సీఎంగా రాష్ట్రాన్ని నెంబర్ వన్ స్థానంలో కేసీఆర్ నిలిపారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పది నెలల్లోనే రూ.80 వేలకోట్ల అప్పు తెచ్చారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో యాదాద్రి, కాళేశ్వరం, సెక్రటేరియట్, 33 జిల్లాలకు కలెక్టరేట్ కార్యాలయాలు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యలయాలు, వైద్య కళాశాలలను నిర్మించారని, వాటిని కూల్చివేస్తారా లేక ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను లేకుండా చేస్తారా అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడం ఎవరి తరం కాదన్నారు. కరువులో ఉన్న రాష్ట్రాన్ని కోటి ఎకరాల మాగాణిగా, అన్నపూర్ణగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ఆయనవెంట మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయోద్దిన్, కౌన్సిలర్లు బాలమణి, మెట్టయ్య, అత్తెల్లి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు నవాజ్ మీరా, బెండ మధు, నాయకులు ఊడెం కృష్ణారెడ్డి, మల్లేశం, కనకయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

భూమి ఆక్రమించారని ఆందోళన

అక్కన్నపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనగిరిలో ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించారని శుక్రవారం గ్రామస్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 945, 947, 948లో ఉన్న 14 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది తమ రాజకీయ పలుకుబడితో కబ్జా చేశారని ఆరోపించారు. ఆ భూమిలో రైతులు ధాన్యాన్ని ఆరబోసుకునే వారని, అక్కడే ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేవారని తెలిపారు. కబ్జాదారులు ఆ భూమిలో పహారి కట్టారని, కొంతమంది ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టారని ఆరోపించారు. ప్రభుత్వ భూమి ఆక్రమించారని తహసీల్దార్, కలెక్టర్‌కు గతంలోనే ఫిర్యాదు చేశామని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ సర్వేయర్‌ను అక్కడికి పంపించారు. ఆక్రమించిన ప్రభుత్వ భూమిని కబ్జాదారులు పట్టాలు చేసుకున్నారని, పట్టాలను రద్దుచేసి సర్వే చేయాలని గ్రామస్థులు సర్వేయర్‌ను అడ్డుకున్నారు.

జాతీయ ఐక్యత శిబిరానికి వర్గల్ మహాత్మా జ్యోతిబాఫూలే విద్యార్థిని



హర్షిత

వర్గల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్గల్ కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం చదువుతున్న హర్షిత జాతీయస్థాయి ఐక్యత శిబిరానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు శుక్రవారం తెలిపారు. కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధర్యంలో హర్యాణాలోని రణబీర్ సింగ్ యూనివర్సిటీలో నిర్వహించనున్న జాతీయ ఐక్యత శిబిరం (నేషనల్ ఇంటిగ్రీటి క్యాంపు) కోసం ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎస్ రాధారాణి సహకారంతో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. దీంతో వైస్ ప్రిన్సిపాల్ గోవింద్‌రావు, కళాశాలి సిబ్బంది ఉమా మహేశ్వరిలు హర్షితను అభినందించారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు సాహిత్



అక్కన్నపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్కూర్‌కు చెందిన అన్నారపు స్వప్న, ఉపేందర్ దంపతుల కుమారుడు అన్నారపు సాహిత్ ఈ నెలలో గోవాలో జరిగే అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. వీరి కుటుంబం వృత్తి రీత్యా హనుమకొండలో ఉంటుంది. అక్కడే ఓ ప్రైవేట్ పాఠశాలలో సాహిత్ తొమ్మిదో తరగతి చదువుతూ కరాటే పోటీలో రాణిస్తున్నాడు. ఇప్పటికే ఏటూరు నాగారం, ఖమ్మం, హన్మకొండలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో బంగారు, వెండి, రజత పతకాలు సాధించాడు. గత ఏడాది 2023 గోవాలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం, స్పారింగ్‌లో రజత పతకం సాధించాడు. గోవాలో ఈనెల 7 నుంచి 10 వరకు జరిగే 24వ ఫస్కా అంతర్జాతీయ కరాటే పోటీల్లో 33 దేశాలు పాల్గొంటున్నాయి. ఈ అంతర్జాతీయ కరాటే పోటీలకు సాహిత్ ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు, కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు

గజ్వేల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీలో ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా ఏఐటీయూసీ కౌన్సిల్ సభ్యులు శివలింగు కృష్ణ ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్మిక సభ్యులు కొండకింది పోచయ్య, కొండి రాజం, రుద్రారం నర్సయ్య, రుద్రారం బిక్షపతి, చింతకింది స్వామి తదితరులున్నారు.

నాచగిరి క్షేత్రంలో స్వాతీ నక్షత పూజలు

వర్గల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహ్మస్వామి క్షేత్రంలో స్వాతీ నక్షత్ర పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ యాగశాలలో స్వాతీ నక్షత్రం సందర్భంగా హోమం నిర్వహించారు. ఈ ప్రత్యేక పర్వదినం సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలను తికలించడానికి భక్తులు అధికంగా తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం, పరిసరాలు కిటకిటలాడాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ అన్నపూర్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుపై హర్షం

- కేక్ కట్ చేసి సంబురాలు

వర్గల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గురుకుల కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచినందుకు గాను శుక్రవారం వర్గల్ మహాత్మా జ్యోతిబాఫూలే గురుకుల కళాశాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెస్ చార్జీలు రూ. 1500 ఉండగా వాటిని రూ 2100కు, కాస్మోటిక్ చార్జీలు రూ. 140 ఉండగా వాటిని రూ. 275కు పెంచడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. జ్యోతిబాఫూలే వెనకబడిన సంక్షేమ విద్యా సంస్థల సెక్రటరీ సైదులుకు విద్యార్థులతో కలిసి అకాడమిక్ కమిటీ నాయకురాలు కావ్య, కళ్యాణి కృతజ్ఞతలు తెలిపారు.

- హుస్నాబాద్‌రూరల్: డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచడం పట్ల హుస్నాబాద్‌లోని మహాత్మాజ్యోతిబాఫూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయురాళ్లు కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విద్యార్థులు, ప్రిన్సిపాల్ వీణాచందన కృతజ్ఞతలు తెలిపారు.



హుస్నాబాద్ రూరల్: కేక్‌కట్ చేసి విద్యార్థులకు అందజేస్తున్న ఉపాధ్యాయులు

విద్యాజ్యోతుల పథకానికి మోక్షం ఎన్నడో?

- సిద్దిపేట బీఆర్ఎస్వీ నాయకులు



మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

సిద్దిపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల డిక్లరేషన్‌లో భాగంగా ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విద్యాజ్యోతుల పథకానికి మోక్షం ఎప్పుడొస్తుందోనని విద్యార్థులు ఎదురుచూస్తున్నారని బీఆర్ఎస్వీ పట్టణ సమన్వయకర్త ఇరుగంటి రమేశ్ అన్నారు. సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదోతరగతి పాస్ అయిన ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు రూ. 10వేలు, ఇంటర్ పాసైతే రూ. 15వేలు, డిగ్రీ పాసైతే రూ. 25వేలు, పీజీ పాసైతే రూ. 1 లక్ష, పీహెచ్‌డీ పూర్తి చేస్తే రూ. 5 లక్షలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన విషయం మీకు గుర్తుందా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో కేవలం ఓట్లు దండుకోవడం కోసం మాత్రమే విద్యార్థులను వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గుజ్జ రాజు, పిట్ల రాకేష్, పడిగే లింగం, గుండెల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పాఠాలు

5వ పేజీ తరువాయి..

లను సాగుచేయడం వంటి అంశాలపై అన్ని వర్గాలకు పాఠాలు బోధించే డిజిటల్ తరగతి గదిలో అధికారులు కూర్చుని పట్టణంలో జరిగే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానాలను వీక్షించారు. స్వచ్ఛ బడి సందర్శనకు వచ్చిన అధికారులకు జ్ఞాపికగా అగర్బత్తి (కొబ్బరి పీచుతో తయారయ్యాయి), స్టీల్ వాటర్‌బాటిల్, సేంద్రియ ఎరువును అందిచారు. చివరగా పర్యాటకరంగంగా మారిన కోమటి చెరువు సందర్శించి సిద్దిపేట అభివృద్ధి సూపరంటూ కితాబునిచ్చారు.

సిద్దిపేటకు వచ్చిన మున్సిపాలిటీల కమిషనర్లు

కాగా రాష్ట్రంలో ఐదు మున్సిపాలిటీలలో జరుగుతున్న తీరును పరిశీలించేందుకు ఎక్కువగా సిద్దిపేట వైపే కమిషనర్లు, అధికారులు మొగ్గు చూపినట్లుగా తెలుస్తున్నది. ఇటీవల సిద్దిపేటకు వచ్చిన వారిలో జనగామ, చేర్యాల, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, నర్సంపేట, వర్ధన్నపేట, సిరిసిల్లా, ఆర్మూర్, భీంగల్, బోధన్, కరీంనగర్, ఖానాపూర్, భైంసా, ఆదిలాబాద్, చొప్పదండి, జీడబ్ల్యుఎంసీ, నిర్మల్, హుజురాబాద్, కొత్తపల్లి, భూపాలపల్లి, బెల్లంపల్లి, జగిత్యాల, పెద్దపల్లి, సుల్తానాబాద్, రైకల్, వేములవాడ, ధర్మపురి, నిజామబాద్, రామగుండం, మెట్‌పల్లి, కోరుట్ల, నాస్‌పూర్, మందమర్రి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, కామారెడ్డి, మంచిర్యాల, ఎల్లారెడ్డి, బాన్సువాడ,లక్షెట్టిపేట, చెన్నూర్ తదితర మున్సిపల్ కమిషనర్లు, అధికారులు ఉన్నారు.